# నంద్యాల ఎన్నికలలో బూటకపు తంతు

నంద్యాల ఉప ఎన్నికలలో పి.వి. నరసింహారావుకు పోటీ లేకుండా చేయడ కోసం కర్నూలు జిల్లా అధికార యంత్రాంగమూ కాంగ్రెస్ (ఐ) నాయకులూ ఉమ్మడిగా చేసిన ప్రయత్నాల గురించి పూర్తి వాస్తవాలు తెలుసుకోవడం కోసం ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపిసిఎల్‌సి) ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్)ల ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీ 27, 28 తేదీలలో జిల్లాలో పర్యటించింది. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు, వెలిగోడు, నంద్యాల, ఆళ్ళగడ్డలలో కమిటీ అనేకమందితో మాట్లాడింది. అధికారులు, కాంగ్రెస్(ఐ) నాయకులూ ఆటంక పరచిన అభ్యర్థులతోనూ, ఈ నేర పర్వానికి సూత్రధారులయిన కాంగ్రెస్(ఐ) నాయకుల తోనూ, వాళ్ళకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన జిల్లా అధికార్లతోనూ కమిటీ మాట్లాడింది.

గతంలో హర్యానాలోని మేహంలో దేవీలాల్ కుటుంబం అధికారాన్ని కాపాడడానికి ఎన్నికల రోజున దౌర్జన్యం జరుగగా, ఇప్పుడు పి.వి. నరసింహారావు ప్రధాన మంత్రిగా కొనసాగడం కోసం నామినేషన్ల దశలోనే దౌర్జన్యకాండ మొదలయింది. 'మనవాడు' అన్న దురభిమానంతో మనం మౌనంగా ఉంటే ప్రజాస్వామ్య విలువలకూ, వ్యవస్థకూ ఘోరమయిన అపచారం చేసిన వాళ్ళమవుతాం.

నామినేషన్ల దశలో జరిగిన నేరాల వివరాలు ఇప్పటికే పత్రికలలో వచ్చాయి కాబట్టి వాటిని మేము మళ్ళీ ఏకరువు పెట్టకుండా, రాజ్యాంగ విలువలనూ, ప్రజాస్వామ్య సాంప్రదాయాలను కాపాడడం కోసం తక్షణం జరగవలసిన చర్యలను దిగువ పేర్కొంటున్నాయి.

(1) అందరికీ నామినేషన్లు వేసే అవకాశం ఇవ్వకుండా ఎన్నికలు జరిపిస్తే ఆ ఎన్నికలు చెల్లవు. పి.వి. నరసింహారావు ఒకవేళ గెలిచినా ఆ గెలుపు చట్టబద్ధమయినది కాదు. కాబట్టి ఇప్పటికే వేసిన నామినేషన్ల రద్దు చేసి తిరిగిఎన్నికల తేదీ ప్రకటించి కొత్తగా నామినేషన్లు ఆహ్వానించాలి. ఈ సారి అందరికీ స్వేచ్ఛగా పోటీచేసే అవకాశం కల్పించాలి. కిడ్నాప్‌కు గురయిన అభ్యర్థులు పెట్టిన ఈ డిమాండ్ల గురించి ఎన్నికల కమీషన్ నుండి వచ్చిన డిప్యూటీ కమిషనర్ గారు ఏమీ మాట్లాడకుండా వెళ్ళి పోవడం శోచనీయం.

(2) జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్(ఐ) నాయకులు ఈ నేరాలకు పాల్పడ్డారు. వారిలో ముఖ్యులు రాష్ట్ర కాంగ్రెస్(ఐ) ప్రధాన కార్యదర్శి కొత్తకోట ప్రకాశ రెడ్డి, కర్నూలు మునిసిపల్ ఛైర్మన్ సుధాకర్‌బాబు, వీరుకాక పత్తికొండ ఎంఎల్‌ఏ శేషి రెడ్డి, కొడుమూరు ఎంఎల్‌ఏ మదనగోపాల్, మాజీ ఎంఎల్‌సి రఘురాంరెడ్డి, మాజీ ఎం.పి. గంగుల ప్రతాప రెడ్డి; కేంద్ర మంత్రి కుమారుడు కోట్ల ప్రకాశ రెడ్డి తదితరులు ఉన్నారు. వీళ్ళు చేసిన నేరాలు అపహరణ, అక్రమ నిర్బంధం, భౌతిక హింస మొదలయినవి ఒకరిద్దరి మీద కాదు, కనీసం 12 మందిమీద ఈ నేరాలకు పాల్పడ్డారు. వీరిలో న్యాయవాది హనుమంతరెడ్డి (ఆత్మకూరు), కోటి రెడ్డి (హైదరాబాద్), రైతునాయకుడు శీలం సంజీవరెడ్డి తమ మీద జరిగిన దౌర్జన్యాలను పత్రికల వారికి వివరంగా చెప్పారు. అయినా ఈ నేరస్థులను పోలీసులు ఇప్పటి దాకా అరెస్టు చేయక పోవడం సిగ్గుచేటు.

ఈ నేరస్తులంతా కేంద్ర న్యాయశాఖ మంత్రి విజయభాస్కర రెడ్డి అనుయాయులనేది అందరికీ తెలిసిన విషయమే, అయినా వారుగానీ పి.వి. నరసింహారావు గానీ ఇప్పటివరకు ఈ నేరాలను ఖండించలేదు. ఈ నేరాలు వారి ఆమోదంతో జరిగినవి కాకపోతే తిరిగి నామినేషన్లు స్వీకరించమని వారెందుకు ఎన్నికల యంత్రాంగాన్ని కనీసం కోరడం లేదు? తాను అధ్యక్షునిగా ఉన్న పార్టీ నాయకులు గూండాయిజానికి పాల్పడితే దండించలేని పి.వి.నరసింహారావుకు దేశాన్ని ఏలే అర్హత వుందా? గుండాయిజం చేయించి ఎన్నికైతే ప్రధాన మంత్రిగా కొనసాగే నైతిక అర్హత వుంటుందా?

(3) రాజకీయ నాయకుల సిగ్గుమాలిన తనం ప్రజలకు అలవాటైపోయిందిగానీ అధికార యంత్రాంగం ఇంతగా దిగజారడం ఈ మధ్యకాలంలో ఎప్పుడూ చూడలేదు. జిల్లా కలెక్టర్ కార్యాలయాన్నీ, సమాచార భవన్‌నూ కాంగ్రెస్(ఐ) కార్యదర్శి ప్రకాశ రెడ్డి, కర్నూలు మునిసిపల్ ఛైర్మన్ సుధాకర్ బాబు అక్టోబర్ 11 నుండి 18 దాకా తమ కిరాయి గుండాలకు హెడ్‌క్వార్టర్స్ చేసుకున్నారు. ఎగ్జెక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాగల కలెక్టరు తదితర రెవెన్యూ అధికార్లంతా వస్తూ పోతూనే ఉన్నారు. వాళ్ళ కనుసన్నలలోనే వీళ్ళ గూండాయిజం సాగుతూవుంది. మస్తాన్ అలీని కలెక్టర్ కార్యాలయం లోనే నిర్బంధించారు. ఆయన చేతికి నామినేషన్ పత్రాలు ఇచ్చిన తర్వాత ఆ కార్యాలయం నుండే అతనిని కిడ్నాప్ చేశారు. హనుమంత రెడ్డిని డిఆర్‌వో సమక్షంలోనే పట్టుకొని కొట్టి అపహరించుకుపోయారు. గ్వాలియర్ నుండి వచ్చిన ఒక వ్యక్తిని కూడా కలెక్టర్ ఆఫీస్ ఆవరణ నుండే ఎత్తుకు పోయారు. 'ఈనాడు' విలేకరి సూర్యప్రకాశ్‌ను డిఆర్‌వో, కలెక్టర్ చూస్తూండగానే ఎత్తుకుపోయే ప్రయత్నం చేశారు.

ఈ నేరాలను ఆపలేకపోయినా, ఇప్పటివరకు ఈ అధికారులు నేరస్తులను అరెస్టు సహితం చేయించలేకపోయారంటే వాళ్ళ విధి నిర్వహణను ఏమని పొగడాలి? వాళ్ళు మెజిస్ట్రేటు హోదాగల రెవిన్యూ అధికారులా లేక కాంగ్రెస్ (ఐ) పార్టీ కిరాయి మనుషులా? కిడ్నాప్ అయినవారుపోగా ముగ్గురు వ్యక్తులు నామినేషన్ వేసే దశను చేరుకొని కలెక్టర్, డిఆర్‌ఓల పుణ్యాన అభ్యర్థులు కాలేక పోయారు. కృష్ణా

జిల్లా నుండి వచ్చిన తోటకూర శివశంకర వీరంజనేయులకు ఉయ్యూరు ఎంఆర్ఓ ఇచ్చిన సర్టిఫికేట్ చెల్లదని చెప్పి వెనక్కి పంపించారు. తాము సర్టిఫికెట్లు ఎప్పుడూ ఆ విధంగానే ఇస్తున్నామని ఎంఆర్ఓ అంటున్నారు. 'ఈనాడు' విలేకరి సూర్య ప్రకాశ్‌కు సర్టిఫికెట్ దక్కనివ్వకుండా చేశారు. తమిళనాడు నుండి వచ్చి నామినేషన్ వేసిన వీరప్పన్ గౌండర్ దొంగ సంతకాలు పెట్టించాడని నామినేషన్ త్రోసి వేయడమే కాక అతని మీద కేసు కుడా పెట్టారు. ఇదంతా స్వయంగా కలెక్టర్, డిఆర్ఓలు చేసిన పని. నంద్యాల ఉప ఎన్నికలను భ్రష్టు పట్టించడంలో వాళ్ళకు ప్రత్యక్షపాత్ర ఉంది. అసలు ఎవ్వరు నామినేషన్ కాగితాలకోసం పోయినా అక్కడుందని ఇక్కడా, ఇక్కడుందని అక్కడా చెప్పి, తిప్పించి, అటూ ఇటూ తిరుగుతూ వుంటూ కిడ్నాప్ చేయడానికి అవకాశం ఈ అధికార్లే కల్పించారని బాధితులంతా అంటున్నారు.

ఇక పోలీసుల గురించి కొత్తగా చెప్పేదేమీ లేదు. ఎవరు కాంగ్రెస్ (ఐ) గుండాలో ఎవరు పోలీసులో తేడా తెలియనంతగా ఇద్దరూ కలిసిపోయి అపహరణలు చేశారు. శిలం సంజీవరెడ్డి నయితే పోలీసులే పట్టుకొని కిడ్నాపర్లకు అప్పజెప్పారు. కొడుతున్నప్పుడూ, జీపులో వేసి తీసుకు పోతున్నప్పుడూ పోలీసులూ, గూండాలూ కలిసే ఉన్నారని బాధితులంతా అంటున్నారు.

తెలుగువాడు ప్రధాన మంత్రి కావడం గర్వకారణం గానీ తెలుగు జాతికి ఇంతటి తలవంపులు తెచ్చిన ఘటన వేరే ఏదీ వుండదు. రాష్ట్రంలోని ప్రజాస్వామిక వాదులంతా ఒక్కటై ఈ డిమాండ్లతో ఉద్యమించాలని కోరుతున్నాం.

నంద్యాల ఉప ఎన్నికలలో ఇప్పటి దాకా జరిపిన బూటకపు తంతును రద్దుచేసి కొత్తగా నామినేషన్లు స్వీకరించాలి.

ప్రకాశ రెడ్డి, సుధాకర బాబు మొదలయిన కాంగ్రెస్ (ఐ) నాయకులను వెంటనే అరెస్టు చేయాలి. వాళ్ళు చేసిన రికగ్నైజబుల్ నేరాలు కాబట్టి వారిని అరెస్ట్ చేయాడానికి లిఖిత పూర్వక మయిన ఫిర్యాదులు అవసరం లేదు. ఇప్పటికి పత్రికలలో వచ్చిన వార్తలు చాలు.

జిల్లా కలెక్టర్, డిఆర్ఓ, ఎస్.పి. లను ఉద్యోగాలలో నుండి బర్తరఫ్ చేసి, పై నేరస్తులకు సహాయ సహకారా లందించినందుకు అరెస్టు చేయాలి.

నంద్యాల దౌర్జన్య కాండకు నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి విజయ భాస్కర రెడ్డి రాజీనామా చేయాలి.

నిజనిర్ధారణ కమిటీ సభ్యులు:- కె. బాలగోపాల్, ఎస్. వెంకట రెడ్డి, వి.నారాయణ రెడ్డి, ఎ. మాధవస్వామి, అఖ్బాబ్ బాషా (విలేకరి)

– కె. బాలగోపాల్
(ఎపిసిఎల్‌సి)

– పి. కోటిరెడ్డి,
(ఒ.పి.డి.ఆర్)

# మేకల మంజూరీలో అధికారుల మోసం

ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఐ.) వారు చింతూరు మండలములోని చూటూరు, ఉలుమూరు గ్రామాల నుండి 10 మంది గిరిజన లబ్దిదారులను మేకల పెంపకమునకు ఎంపిక చేశారు. ఆ లబ్దిదారులు : ఉలుమూరు గ్రామం నుండి పులి నారాయణ, పంజ మల్లయ్య, కుంజ భీమయ్య, మడివి దేశయ్య, పూనెం రాఘవయ్య, తుర్రం సుబ్బయ్య. చుటూరు గ్రామస్థులు సవలం నాగయ్య, సవలం భద్రయ్య, పాయం వెంకయ్య.

ఒక్కొక్క లబ్దిదారునికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాంతీయ బ్యాంక్ వారు కలసి రూ. 6,100 అప్పు మంజారీ చేసి మేలు జాతి మేకలను కొని లబ్దిదారుల కివ్వడం, మేకల పెంపకం వల్ల ప్రయోజనం పొందుతూ లబ్దిదారులు అప్పుకు తిరిగి చెల్లించి తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చుకోవడం. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 50% సబ్సిడీ యివ్వడంతో లబ్దిదారులు కేవలం 50% అప్పు తిరిగి చెల్లిస్తే సరిపోతుంది. మేకలను లబ్దిదారుల సమక్షంలో వారికి నచ్చినవి మంజూరీ సొమ్ముకు మించకుండా కొనుగోలు చేయాల్సి ఉంది. కాని అలా జరగలేదు.

ఎంపిక కాబడిన రెండు గ్రామాల 10 మంది లబ్దిదారులకు మేకల కొనుగోలు నిమిత్తం రాజమండ్రి రావల్సిందిగా చింతూరు మండల కేంద్రం నుండి ఆర్.డి.ఎ. సబ్ అసిస్టెంట్ ద్వారా కబురు అందింది. ఆ ప్రకారం లబ్దిదారులందరూ రాజమండ్రి చేరు కున్నారు కాని వారు సంబంధిత అధికారులను కలుసుకోవడానికి ఒక రోజుపాటు పడిగాపులతో ఎదురు చూడాల్సి వచ్చింది. చివరకు వారు గ్రామాభివృద్ధి అధికారి, బ్యాంక్ ప్రతినిధి, పశువైద్య ఉద్యోగిని కలుసుకొన్నారు. లబ్దిదారులను రాజమండ్రి నుండి హుండీ భీమవరం తీసుకువెళ్లారు. అధికారులకు పరిచయమున్న ఒక పెద్ద రైతు ఇంట్లో లబ్దిదారులను ఉంచి, విజయవాడ వైపు వెళ్లి మేకలను కొని తెస్తామని అంతవరకు వారిని అక్కడే ఉండమని చెప్పి వెళ్లిన అధికారులు రెండు రోజుల తర్వాత లారీపై మేకలతో వచ్చి లబ్దిదారులను ఎక్కించుకొని చింతూరు చేరుకున్నారు. తెల్లారిన తర్వాత తమ బతుకు కోసం కొనుగోలు చేసే మేకలను చూసుకొన్న లబ్దిదారులు అవి సరైనవి కావని వాటి వల్ల తమకు ఎటువంటి ప్రయోజనం జరగదని అధికారులతో మొరపెట్టు కున్నప్పటికీ మేకలను తీసుకు వెళ్లక తప్పలేదు. ఒక్కొక్క లబ్దిదారునికి 12 మేకలు యిచ్చారు వాటిలో నాలుగు ముసలివి సంతానానికి పనికి రానివి ఎనిమిది మేకలు ఇంకను తల్లి వద్ద పాలు త్రాగేవి.

లబ్దిదారుల అభిప్రాయం, అవసరాలతో నిమిత్తం లేకుండా కనీసం వారి సమక్షంలో కూడా కొనకుండా పనికి మాలిన మేకల రూపంలో గిరిజనులకు బలవంతంగా సహాయం అంటగట్టారు, చేతులు దులుపుకున్నారు. సంబంధిత అధికార్లు, ప్రైవేట్ దళారుల మాదిరిగా ప్రవర్తించారు.

మేకల మంజూరీలో జరిగిన అవక తవకల గురించి కలెక్టర్‌కు